# జల్సాల కోసం దొంగతనాలు

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- రూ. 1.93 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం

**శెనార్తి మీడియా, రామగుండం :**

జల్సాలకు అలవాటు పడి గోదావరి ఖని వన్ టౌన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. మంగళ వారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖని రమేష్ నగర్ కు చెందిన కవ్వంపల్లి అరుణ్ కుమార్ (23) డిగ్రీ చదువుతూ చెడు అలవాట్లకు బానిసై, జల్సాలకు డబ్బులు కావాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ



నెల 10, 11 తేదీలలో విఠల్‌నగర్‌లో తాళం వేసిన ఇళ్లలో చొరబడి బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. అనుమానాస్పదంగా 5-ఇన్‌క్లైన్ ప్రాంతంలో తిరుగుతుండగా సీఐ, క్రైమ్ పార్టీ సిబ్బంది అరుణ్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా దొంగిలించిన ఆభరణాలు, నగదు దొరికాయి. విచారించగా అరుణ్ వాటిని అమ్మి జల్సాలకు డబ్బులు ఖర్చు చేస్తున్నట్టు ఒప్పుకున్నాడన్నారు. అరుణ్ కుమార్ వద్ద సుమారు రూ.1.93 లక్షలు విలువైన 23.6 గ్రాముల బంగారం (రూ.1.71 లక్షలు), 45 తులాల వెండి (రూ. 22 లక్షలు)తో పాటు రూ. 500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విలువైన వస్తువులను వదిలివెళ్లకూడదు.

సెలవులలో గ్రామాలకు, మరేదైనా యాత్రలకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులను వదిలివెళ్లకూడదని డీసీపీ కరుణాకర్ సూచించారు. వీలైతే బ్యాంక్ లాకర్లు లేదా భద్రమైన ప్రదేశాల్లో ఉంచి, ఇంటిని గమనించమని పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలన్నారు. బయలుదేరే ముందు పోలీసులకు సమాచారం ఇస్తే అదనపు పహారా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ అనూష, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సదానందం, కానిస్టేబుళ్లు మధుకర్, మధుసూదన్, రమేష్ లకు డీసీపీ కరుణాకర్ క్యాష్ రివార్డ్ ప్రకటించి అభినందించారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కవ్వంపల్లి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ మండలంలోని ఎల్లంపల్లి, దేవక్కపల్లి, తలారివానిపల్లిలో ఇటీవల మృతి చెందిన ఐలేని మనవ్వ, సంఘం రాజేందర్, తాళ్ల రాజవ్వ, మెండె కొమురయ్య, తాటి జ్యోతి కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోధర్, మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, జిల్లా నాయకులు బైర సంతోష్, అక్కరవేణి పోచయ్య, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, బోనగిరి రూపేష్, ఎలిగే సతీష్, మచ్చ కుమార్, లింగాల శ్రీనివాస్, సంగెం మధు, బోనగం రమేష్, రోడ్డ మల్లేశం, సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

**శెనార్తి మీడియా, రామగుండం :**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ ఆఫీస్ టర్నింగ్ వద్ద రోడ్డుపై పడ్డ గుంతలను ట్రాఫిక్ పోలీసులు పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూశారు. వర్షాలతో రోడ్డుపై గుంతలు మరింత ప్రమాదకరంగా మారి ప్రజలు, వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. ఈ విషయాన్ని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ ఎస్ఐ హరి శంకర్ ముందడుగు వేశారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి సహకారంతో గుంతలు పూడ్చారు. ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ సిబ్బంది స్వయంగా గుంతలు పూడ్చడంతో వాహనదారులు, స్థానికులు అధికారులను అభినందించారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

**వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ కరుణాకర్**



**శెనార్తి మీడియా, రామగుండం :**

భార్య, భర్తల మధ్య తలెత్తిన వాగ్వాదం కారణంగానే భార్యను భర్త హత్య చేసినట్లు పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. మంగళ వారం గోదావరి ఖని – 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏసీపీ మడత రమేష్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్ పల్లి ప్లాట్స్‌లో ఆదివారం చోటు చేసుకున్న వివాహిత హత్య కేసులో పోలీసులు నిందితుడు పూసల కృపాకర్‌ను అదుపులోకి తీసుకుని సంఘటన వివరాలు తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన పూసల కృపాకర్ కు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రశాంతి అలియాస్ రమాదేవి (38)లు 13 ఏండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి రామగిరి మండలం వకీల్ పల్లి ప్లాట్స్ లో ఉంటున్నారు. ఏడాది నుంచి వీరి మధ్య విభేదాలు పెరిగడంతో వేర్వేరుగా జీవించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆది వారం రమాదేవి భర్త కృపాకర్ ఇంటికి వెళ్లడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహంతో కృపాకర్ భార్యపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి తల, మెడ, కడుపు, తుంటి మీద పొడవడంతో రమాదేవి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఏసీపీ మడత రమేష్, రామగిరి ఎస్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా లద్నపూర్ వద్ద కృపాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఉపయోగించిన వాహనం, హత్యకు ఉపయోగించిన కత్తి ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మిగిలిన అత్తమామలను కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు.



## వైద్య శిబిరం

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**

వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి జమ్మికుంట మున్సిపల్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో డాక్టర్ మహోన్నత పటేల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 54 మంది కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి ల్యాబ్‌కు పంపించారు. అలాగే రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహోన్నత పటేల్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు మంజుల, రజితతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతును రక్షించిన కానిస్టేబుల్ సురేందర్‌కు సన్మానం



**శెనార్తి మీడియా, సిరిసిల్ల (గంభీరావుపేట):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు దేవయ్య మానేరు వాగులో చిక్కుకుపోయాడు. ఈ విషయాన్ని గమనించిన జిల్లా డీఆర్ఎఫ్ టీమ్ కానిస్టేబుల్ సురేందర్ అప్రమత్తంగా స్పందించి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి రైతును కాపాడాడు. ఈ సంఘటనను పురస్కరించుకుని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులు సురేందర్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. ఆయన చూపిన కర్తవ్యనిబద్ధత, ప్రజాసేవా భావానికి గుర్తింపుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేసే పోలీసులు సమాజానికి ఆదర్శప్రాయులని అధికారులు పేర్కొన్నారు.

## జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం




**శెనార్తి మీడియా, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణా కాలనీ (27వ వార్డు) సమస్యల పరిష్కారం కోసం సామాజిక కార్యకర్త, కాలనీ నివాసి గాజంగి వీరన్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. కనకయ్య మేస్త్రి ఇంటి ముందున్న కల్వర్టు దెబ్బతినడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోందని, వర్షాల సమయంలో విషజ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొని కిందపడిపోయిన ఘటనలు కూడా ఉన్నాయని వివరించారు. సమస్య పరిష్కారానికి కనకయ్య మేస్త్రి ఇంటి నుండి రెండు వైపులా కొత్త డ్రైనేజీలు నిర్మించాలని, కాలనీలోని పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు. అదేవిధంగా, 2021లో మిషన్ భగీరథ ద్వారా నీరు అందించినప్పటికీ, నల్ల బిల్లులు మాత్రం 2019 నుంచే వసూలు చేస్తున్నారని అభ్యంతరం తెలిపారు. ఈ కార్యక్రమంలో చందనాల జయరాములు, కురిమిండ్ల కనకయ్య మేస్త్రి, మూల హరీష్, కురిమిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫాజుల్‌నగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్



**శెనార్తి మీడియా, వేములవాడ :** వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్ నగర్ గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి డాక్టర్ దివ్యశ్రీ అధ్యక్షతన 103 మందిని ఆరోగ్యపరీక్షలు చేశారు. అందులో పది మందినుంచి తెమడ నమూనాలు సేకరించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు రాజయ్య, ఎమ్మెల్‌హెచ్‌పి ప్రసూన, సీనియర్ టీబీ సూపర్వైజర్ గంగాధర్, ఏఎన్ఎం లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా అనిల్ కుమార్

**శెనార్తి మీడియా, రామగుండం :**



భారతీయ జనతా పార్టీ అనుబంధ భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) 8వ కాలనీ మండల అధ్యక్షుడిగా ఐలవేన అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల అఖిల్ గౌడ్ నియమితులైనట్లు బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శశికుమార్ మంగళ వారం ప్రకటించారు. అనిల్ కుమార్ గతంలో ఏబీవీపీ కేశవనగర్ మండలం కన్వీనర్ గా, బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ రెడ్డి, రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, జిల్లా నాయకులు మూకిరి రాజు, కాలనీ సీనియర్ నాయకులు, మండలం నాయకులు, పట్టణ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

**శెనార్తి మీడియా, రామగుండం :**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ సీతా నగర్ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఎండి హకీమ్ కుటుంబానికి మంగళ వారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నీలకంటి రాం రూ. 5 వేలు సాయం అందజేశారు. ఇక్కడ 38 డివిజన్ అధ్యక్షుడు పంజాల ఆంజనేయులు, మహిళా నాయకురాలు రజిత, పసరగొండ రాంకి, లింగన్న, నేరెళ్ల రాజకుమార్, మహమ్మద్ షఫీ, కిషోర్, మల్లేష్, అజీమ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలను పిల్లలకు అభ్యాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



- సీడీపీఓ అలేఖ్య పటేల్

**శెనార్తి మీడియా, రామగుండం :** అంగన్‌వాడీ సెంటర్ లు కేవలం పోషణ ఆహారం అందించే కేంద్రాలుగా కాకుండా, పిల్లలకు అభ్యాస కేంద్రాలుగా తీర్చిదిద్దే ఆలయాలుగా తీర్చిదిద్దాలని సీడీపీఓ అలేఖ్య పటేల్ అన్నారు. మంగళ వారం మండలంలోని ఎన్టీపీసీ మిలీనియం ఫంక్షన్ హాలులో రామగుండం ప్రాజెక్టు స్థాయి పోషణ్ 2.0 పక్షంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోషణ్ బి పడాయి శిక్షణ ద్వారా అంగన్వాడీ సెంటర్లలో విద్యను మెరుగుపర్చాలన్నారు. దీనిపై ప్రతి అంగన్వాడీ టీచర్ గర్భిణీలు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలకు సరైన అవగాహన కల్పించాలని, పిల్లలకు ప్రతిరోజూ సమగ్ర పోషకాహారం అందించి, వారి శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎండి షరీన్, అంజలి, మమత, సరస్వతి, లక్ష్మి, జమున, సువర్ణ, విజయ, దీపికతో పాటు రామగుండం ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.